క్లుప్తంగా

పిచ్చికుక్క స్వైరవిహారం 10 మందికి గాయాలు



మండపేట ప్రభుత్వ ఆస్పత్రిలో కుక్కకాటు బాధితులు

మండపేట: మండపేటలో మంగళవారం పిచ్చి కుక్క దాడిలో 10 మంది వరకూ గాయపడ్డారు. స్థానిక ఆలమూరు రోడ్డు, కలువ పువ్వు సెంటర్, వల్లూరి వారి వీధి తదితర ప్రాంతాల్లో పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. క్షతగాత్రులు ప్రభుత్వాస్పత్రికి చేరుకుని చికిత్స పొందారు. మంగళవారం కుక్క కాటు కేసులు పది వరకూ నమోదైనట్టు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. రాబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని బాధితులందరికీ వైద్యం అందిస్తున్నామని ప్రభుత్వాసుపత్రికి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమానందిని తెలిపారు. స్థానికులపై దాడి చేసిన కుక్కను పట్టుకునేందుకు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ప్రయత్నాలు చేపట్టారు.

ఘనంగా అన్న సమారాధన

మండపేట: మండపేట టైలర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 96వ శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. స్థానిక బంగారు కొట్లు వీధిలో 1927 నుంచి టైలర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏటా శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఉత్సవాలు ముగింపులో భాగంగా మంగళవారం భారీ అన్న సమారాధన జరిగింది. సుమారు 2000 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సంఘ అధ్యక్షుడు రేకపల్లి శ్రీనివాస్, నాయకులు పీఎస్ మూర్తి, వింజరపు శ్రీనివాస్, బీరక సాంబశివరావు, తూతిక వీర్రాజు, జొన్నపల్లి సత్తిబాబు, హరిపారల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉపాధి కల్పిస్తాం

కె.గంగవరం: గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి పని కల్పిస్తామని సర్పంచ్ పిల్లి అన్నపూర్ణ అన్నారు. మండలంలోని మసకపల్లి పంచాయతీ శివారు కోటగుంటలో చెరువు పూడిక తీత పనులకు మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి కళ్యాణ్, కాదా గోవిందుతో కలసి కొబ్బరికాయ కొట్టి ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గతంలో కన్నా ఈ ఏడాది ప్రతి ఒక్కరికి పనికల్పించేందుకు చర్యలు తీసుకున్నామని దీనిలో భాగంగానే పనులు గుర్తించామన్నారు. వేసవి తాపానికి గురికాకుండా ఉపాధి కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకుని పని చేసుకోవాలని సూచించారు.

పాలిటెక్నిక్‌కు ఉచిత శిక్షణ

రాయవరం: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు మండలంలోని లొల్ల విశ్వమానవతా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరు శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 23 నుంచి మానవతా ఆశ్రమంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఉచితంగా ఇచ్చే ఈ శిక్షణకు ఆసక్తి గల టెన్త్ విద్యార్థులు హాజరు కావాలని సూచించారు. అలాగే వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఉచితంగా స్పోకెన్ హిందీ, ఇంగ్లిష్‌తోపాటు వ్యక్తిత్వ వికాస తరగతులు, యోగా, కరాటే, సంగీత అభ్యాసనకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. మూడు నెలల యోగ ఉపాధ్యాయ ధ్రువపత్ర సర్టిఫికెట్ కోర్సు ఉచితంగా నేర్పుతామని, టెన్త్ కనీస విద్యార్హత ఉన్న యువతీయువకులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. వివరాలకు 99666 73283, 9966673111 నంబర్లకు సంప్రదించాలన్నారు.

జీతాలు చెల్లించాలంటూ ప్రైవేటు ఉద్యోగుల నిరసన

కె.గంగవరం: స్థానిక ఎమ్మార్సీ వద్ద మంగళవారం సర్వశిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రైవేటు ఉద్యోగులు జీతాలు చెల్లించాలని భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గత రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన చెందారు. జీతాలు చెల్లించడంతో పాటు ఉద్యోగాలను క్రమబద్ధీకరణ చేసి భద్రత కల్పించాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంఈఓ నాగరాజుకు అందించారు. ప్రైవేటు ఉద్యోగులు సత్యనారాయణ, వెంకన్నబాబు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై ప్రజలకు అవగాహన సదస్సు

సఖినేటిపల్లి: మండలంలోని పల్లిపాలెం సైక్లోన్ షెల్టర్ వద్ద మంగళవారం జిల్లా కలెక్టర్ ఆదేశాలపై రెవెన్యూ, ఎన్‌డీఆర్‌ఎఫ్ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ వై.రామకుమారి పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సులో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు కమ్యూనిటీ అవేర్‌నెస్, ఫెమిలియరైజేషన్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. అలాగే విపత్తుల సమయాల్లో క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందించే సేవలను, రక్షణ చర్యలను ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ భాస్కర్, మెరైన్ ఎస్సై సోమశేఖర్ రెడ్డి, సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీను, ఎంపీటీసీ పోతాబత్తుల భాస్కరరావు, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవకారుడు ఫూలే

- మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి
- ఘనంగా ఫూలే జయంతి



రామచంద్రపురంలో ఫూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి తదితరులు

రామచంద్రపురం: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటం చేసిన సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిరావు ఫూలే అని మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యాం, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, పట్టణ పార్టీ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్‌లు కొనియాడారు. జ్యోతిరావు ఫూలే జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాలలో ఆత్మస్థైర్యాన్ని కల్పించి వారి హక్కుల కోసం పోరాడిన తత్వవేత్త, ఉద్యమకారుడు ఫూలే అన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని అణగారిన వర్గాలలో విద్యావ్యాప్తిని చేసిన మహనీయుడు జ్యోతిరావు ఫూలేని కొనియాడారు. ఎంపీపీ పంపన నాగమణి, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, పిల్లి రాంబాబు, వీరబోయిన సూరిబాబు, మున్సిపల్ కౌన్సిలర్ కేతా శ్రీను, పార్టీ నేతలు ఉప్పు బులిరాజు, దార్ల శ్రీను, పాటి ప్రసాద్, కంచి సత్యానందం తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఫూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ కార్మిక సంఘాల నేతృత్వంలో డిపో వద్ద జరిగిన కార్యక్రమానికి డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొని ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్మికులకు అన్నదానం చేశారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డులో జరిగిన కార్యక్రమంలో ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, నాయకులు పాల్గొన్నారు. ప్రధాన రహదారిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన మహాత్మ జ్యోతిరావు ఫూలే జయంతి కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు పాల్గొని ఆయనకు నివాళులర్పించారు. ఫూలే చేసిన సేవలను కొనియాడారు.



ద్రాక్షారామ పంచాయతీ వద్ద ఫూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



గొల్లపాలెంలో ఫూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఫూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ద్రాక్షారామ పంచాయతీలో ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఫూలే అందించిన సేవలను కొనియాడారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా, వార్డు సభ్యులు డేగల వెంకటరమణ, కాలుకురచ ఏడుకొండలు, యండమూరి ఈశ్వరరావు, కొసనా భీమశంకరం, సాక్షి పద్మనాభం, నరాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కాజులూరు: ఫూలే ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని గొల్లపాలెం పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ సత్తి శ్రీరామారెడ్డి అన్నారు. కాజులూరు మండల గ్రామాల్లో మంగళవారం ఫూలే జయంతి వేడుకలను స్థానిక నాయకులు, ప్రజలు ఘనంగా నిర్వహించారు. గొల్లపాలెంలో శివాలయం వద్ద విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మేడిశెట్టి శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీరామారెడ్డి పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలంలోని దంగేరు గ్రామ సచివాలయం వద్ద మంగళవారం మహాత్మ జ్యోతిరావు ఫూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, సొసైటీ చైర్మన్ చిట్టూరి సుబ్రహ్మణ్యం తదితరులు ఫూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు వాసంశెట్టి శ్రీనివాస్, గెద్దాడ శ్రీరాములు, కుక్కల సత్తిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానికంగా ఫూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఉద్యోగుల సంఘం నాయకుడు జిత్తుగ మల్లికార్జునుడు, సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా, పార్టీ గ్రామ అధ్యక్షుడు కట్టా మురళి, మేడిశెట్టి దుర్గారావు, పిప్పర సంపదరావు పాల్గొన్నారు.



దంగేరులో ఫూలే జయంతి సందర్భంగా స్వీట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



కపిలేశ్వరపురంలో ఫూలేకు నివాళి అర్పిస్తున్న ఎంపీపీ, నాయకులు

మహనీయుడు జ్యోతిరావు ఫూలే

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- జ్యోతిరావు ఫూలేకు ఘనంగా నివాళి



మండపేటలో ఫూలేకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



రాయవరంలో ఫూలేకు నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటరమణ తదితరులు

మండపేట: బడుగు,బలహీన వర్గాల సంక్షేమానికి మహాత్మా జ్యోతిరావు ఫూలే చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఫూలే జయంతి వేడుకలను మంగళవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పెద కాలువ వంతెన వద్ద గల ఫూలే విగ్రహానికి ఎమ్మెల్సీ తోట, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ మహిళా సాధికారత, అందరికీ విద్య, పేదల అభ్యున్నతి వంటి ఫూలే ఆశయాల స్ఫూర్తిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, సొసైటీ చైర్మన్ కుక్కల రామారావు, బీసీ సంఘం నాయకులు పిల్లి శ్రీనివాస్, పంపన శ్రీనివాస్, వీరమల్లు శ్రీనివాస్, పెంకే గంగాధర్, పెంకే వెంకట్రావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు టీడీపీ నాయకులతో కలిసి ఫూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, సంఘ నాయకుడు కోన సత్యనారాయణ ఆధ్వర్యంలో ఫూలే జయంతిని నిర్వహించారు. స్థానిక కలువ పువ్వు సెంటర్ నుంచి పెదకాలువ వంతెన వరకు బైక్ ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఫూలే చిత్ర పటానికి ఎంపీడీఓ ఐ.రాజు నివాళులర్పించారు. ఏడిదలో సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్ తదితరులు నివాళులర్పించారు.

రాయవరం: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు ఫూలే అని ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫూలే జయంతిని నిర్వహించారు. ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ మాట్లాడుతూ ఫూలే ఆదర్శ భావాలు కలిగిన వ్యక్తి అని, ఆయన సిద్ధాంతాల బాటలో నేటి యువత నడవాల్సిన అవసరం ఉందన్నారు. తొలుతగా ఫూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తమలంపూడి గంగాధరరెడ్డి, ఎంపీడీవో డి.శ్రీనివాసు, పీఆర్ ఏఈ రామనారాయణ, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: మహిళ సాధికారత ధ్యేయంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు రుణమాఫీ సాయం పంపిణీ కార్యక్రమం మంగళవారం సాయంత్రం ద్వారపూడిలో నిర్వహించారు. పంచాయతీ సర్పంచ్ ఈతకోట కిన్నెర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట, పార్టీ రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడు కర్రి పాపారాయుడు, రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు. ద్వారపూడి, చిన ద్వారపూడి, జెడ్ మేడపాడు గ్రామాల డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చెక్కు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, ఉప సర్పంచ్ తులా శేషారావు, సొసైటీ చైర్మన్ దంతులూరి శ్రీరామవర్మ, దూలం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా జగనన్నే మా భవిష్యత్తు



ఏడిదలో జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమంలో పార్టీ నాయకులు



గొల్లపాలెంలో 'జగనన్నే మా భవిష్యత్తు'లో ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న గృహసారథులు



కూళ్లలో సంక్షేమాన్ని వివరించి కరపత్రాన్ని అందిస్తున్న పార్టీ నాయకులు

మండపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనపై వైఎస్సార్ సీపీ చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు ఉత్సాహపూరిత వాతావరణంలో సాగుతోంది. వాడవాడలా పార్టీ జెండాలు చేతపట్టి ప్రతి ఇంటికీ వెళుతూ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ పార్టీ శ్రేణులు సందడి చేస్తున్నారు. మంగళవారం మండపేట 7వ వార్డులో పార్టీ నేత మందపల్లి రుద్రకాంత్, 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. మండలంలోని ఏడిదలో సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, కుడిపూడి రాంబాబు తదితరులు గృహ సారథులు, పార్టీ నాయకులతో గ్రామంలోని పలు ఇళ్లను సందర్శించి పార్టీ కేంద్ర కార్యాలయం ఇచ్చిన ప్రశ్నావళిని ప్రజల ముందుంచి సమాధానాలు రాబట్టారు.

కపిలేశ్వరపురం: తాతపూడిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఎంపీటీసీ సభ్యురాలు జుత్తుక వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు గూటం సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలిసి వారు ఇంటింటి పర్యటన చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ది తాలూకు వివరాలను కుటుంబాలు వారీగా వివరించారు. వారి సమ్మతిపై మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టిక్కర్‌ను ఇంటి గోడకు అతికించారు.

'జగనన్నే మా భవిష్యత్తు'కు విశేష స్పందన

కాజులూరు: 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని పార్టీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు అన్నారు. మంగళవారం మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లోనూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి నాడు–నేడు ప్రభుత్వ పాలనలో వ్యత్యాసాలను వివరిస్తూ పార్టీ నుంచి వచ్చిన ప్రశ్నపత్రంలోని ఐదు ప్రశ్నలకు జవాబులు రాబడుతూ ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. స్టిక్కర్లు, కరపత్రాలు పంచారు. కార్యక్రమాల్లో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబురావు, ఎంపీటీసీ సభ్యులు జొన్నకూటి పద్మ, పార్టీ మండల సేవాదళ్ కన్వీనర్ టేకుమూడి దుర్గారావు, వడ్డి శ్రీను, తోట కృష్ణ, మాత నాగరాజు శ్రీను, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: సీఎం జగన్ నాలుగేళ్ల పాలనలో నవరత్నాల ద్వారా అందించిన సంక్షేమ సమాచారాన్ని జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, కన్వీనర్లు ఇంటింటికీ ప్రచారంతో అలుపెరగని ఉత్సాహంతో పని చేస్తున్నారు. నాలుగేళ్ల పాలనలో ఇచ్చిన హామీలన్నీ దాదాపుగా సీఎం నెరవేర్చారని ప్రజల ముందుకు నమ్మకం, ధైర్యంతో వెళ్తున్నామన్నామని వారు చెబుతున్నారు. గృహసారథులు, వలంటీర్లు, కన్వీనర్లతో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమాన్ని వివరించి సర్వే వివరాలు నమోదు చేసుకుని స్టిక్కర్లు అంటించారు. కూళ్లలో జరిగిన కార్యక్రమంలో పార్టీ కాపు నాయకుడు తొగరు మూర్తి పాల్గొని పథకాలను ప్రజలకు వివరించారు. ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏజీపీ మురళి



బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళి ఇతర కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: బార్ అసోసియేషన్‌కు మంగళవారం జరిగిన ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది, ఏజీపీ పిల్లి మురళీమోహన వెంకటరమణ 92 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన టీఎస్ఎస్ చలపతికుమార్, గాడేపల్లి సతీష్, బండి శ్రీనివాసరావు, వి.నరేంద్రకుమార్‌లు ఎన్నికల వివరాలను వెల్లడించారు. బార్ అసోసియేషన్‌లో మొత్తం 179 ఓట్లు ఉండగా 161 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షుడిగా పిల్లి మురళీమోహన్ వెంకటరమణకు 126 ఓట్లు రాగా, ప్రత్యర్థి ఎంవీ సుబ్బారావుకు 34 ఓట్లు పోలయ్యాయి. కార్యదర్శిగా వాడ్రేవు సాయిప్రసాద్, జాయింట్ సెక్రటరీగా చిన్నం వీర్రెడ్డిలు ఎన్నికయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కాగా ఉపాధ్యక్షులుగా పోటీచేసిన పలివెల సత్యనారాయణ, డీఎస్ఎస్ శర్మలకు సమానంగా ఓట్లు రావటంతో ఇద్దరిని ఉపాధ్యక్షులుగా ఎన్నికైనట్లు ప్రకటించారు. కాగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన పిల్లి మురళి, నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమం శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అభినందనలు తెలిపారు.

మెకానిక్‌లకు గుర్తింపు కార్డుల అందజేత

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ భీమేశ్వర మోటారు సైకిల్ మెకానిక్ యూనియన్ సభ్యులకు రాష్ట్ర సంఘం గుర్తింపు కార్డులను ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ అందజేశారు. సంఘ సమావేశం ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించుకున్నారు. సమావేశానికి ఎస్సై వినోద్ ముఖ్య అతిథిగా పాల్గొని గుర్తింపు కార్డులను అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా మరమ్మతుల కోసం వాహనాలు తీసుకుని వచ్చి మెకానిక్‌ల వద్ద వదిలి వేస్తే సమాచారం తమకు తెలియజేయాలని సూచించారు. అనంతరం కొత్త సాంకేతికతతో వస్తున్న బీఎస్ 6 వాహనాల రిపేరు విషయంలో సభ్యులకు శిక్షణ ఇప్పించేందుకు షోరూమ్ యజమానులతో మాట్లాడుతున్నట్లు సంఘ అధ్యక్షుడు పిల్లా కృష్ణ వివరించారు. మెకానిక్‌ల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు మద్దూరి సత్యప్రసాద్, ఉపాధ్యక్షుడు దడాల రవికుమార్, కార్యదర్శి పిల్లి భీమన్న, కోశాధికారి అనిశెట్టి ముత్యాలరావు, సభ్యులు పాల్గొన్నారు.

జేవీకే సామగ్రి పంపిణీకి సమగ్ర చర్యలు

రాయవరం: జగనన్న విద్యాకానుక నాల్గో విడత పంపిణీకి చర్యలు చేపడుతున్నట్లు ఎంఈవో వై.సత్యనారాయణ తెలిపారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జేవీకే సామగ్రి పంపిణీ సన్నాహక సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఇప్పటి నుంచే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అందులో భాగంగానే మండల స్టోరేజ్ పాయింట్‌ను సిద్ధం చేశామన్నారు. స్టోరేజ్ పాయింట్ పరిశీలనకు జిల్లా పరిశీలకుడు నిరంజన్‌కుమార్, సమగ్ర శిక్ష సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం బుధవారం పరిశీలనకు రాయవరం వస్తున్నట్లు తెలిపారు. జేవీకే సామగ్రి స్టోరేజ్ పాయింట్లలో భద్రపర్చడం, పాఠశాలల పంపిణీకి ఎనిమిది కమిటీలను నియమించామన్నారు. ఈ కమిటీల్లో ఎంఐఎస్ కో–ఆర్డినేటర్, సీఆర్పీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు సభ్యులుగా ఉంటారన్నారు. నిరంతరం పర్యవేక్షణతో జేవీకే పంపిణీని సక్రమంగా చేపడతామన్నారు. సమావేశంలో ఏఎంవో రాంబాబు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ ఎస్.రామారావు, డేటా ఎంట్రీ ఆపరేటర్ అంపోజు కృష్ణమూర్తి, సీఆర్పీలు వై.లక్ష్మీవీర్రాజు, కె.పోసిరాములు, వి.సీతాధనలక్ష్మి, కె.సీనాసిరి తదితరులు పాల్గొన్నారు.